పెళ్ళిచూపులు

గుమ్మా ప్రసాదరావు

"నాన్నా! ఈ పెళ్ళిచూపులకు సంసిద్ధంగా లేను అసలు ఈ వివాహ వ్యవస్థమీదే నాకు నమ్మకంలేకుండా పోయింది" అంది అనూరాధ ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి

సత్యనారాయణ కూతురికేమని చెప్పాలా అన్న ఆలోచనలో పడిపోయాడు అనూరాధ స్థితి అతనికి అర్థం కాకపోలేదు తను ప్రతీమారు ఒక సంబంధం తీసుకురావడం, పెళ్ళిచూపులు అనే పేరుతో అర్థంలేని ప్రశ్నలు వేసి విసిగించి చివరకు పిల్ల నచ్చలేదనో, కట్నం చాలదనో పెదవి విరిచేయడం

అనూరాధ అనాకారి కాదు అయితే పాలరాతి విగ్రహంలాగుండదు చామనఛాయ, దేముడిచ్చిన రంగుకి ఎవరుమాత్రం ఏం చెయ్యగలరు? ముఖ్యంగా ఆమె నచ్చకపోవడానికి ఆమె రూపం కారణంకాదు; తను ఇవ్వలేని కట్నం బడిపంతులు ఉద్యోగం చేస్తున్న తను వారు ఆశించే పది—పదిహేను వేలు కట్నం ఎక్కడనుంచి తేగలడు? రోజురోజుకి ఎదుగుతున్న కూతుర్ని ఎంతకాలం ఉంచుకుంటాడు—గుండెలమీద కుంపటిలా??

"అదేమిటి? — పెళ్ళివారు ఇంటికి వచ్చే సమయం అవుతూవుంటే ఇప్పుడు ఈధోరణేమిటి?" అంది పార్వతి

ప్రతీమారు ఈ సంబంధం ఖాయం అవుతుందని ఆమె ఆశపడడం — నిరాశ ఎదురవడం ఆమెకు మామూలే

"అమ్మా! పెళ్ళి అంటే నాకు విముఖతలేదు అయితే ఈ పరిస్థితులలో నాకు పెళ్ళి అవుతుందన్న ఆశలేదు పెళ్ళికొడుకులు కొండెక్కి కూర్చుంటున్నారు వారిని కిందకు దింపే తాహతు మనకులేదు రోజురోజుకి కట్నాలదాహం ప్రబలిపోతూన్నది అనవసరంగా ఈ ఏర్పాట్లకు పాతికో ముప్ఫయ్యో ఖర్చుచేయడం దండగ"

"అనూ! ఏ వ్యవస్థలోనైనా మంచితోపాటు చెడూవుంటుంది వివాహం అంటే నూరేళ్ళపంట కాబోయే భార్యాభర్తలు ఒకరినొకరు చూసుకోవడం— నచ్చుకోవడం అవసరం కాదంటావా? ఈ ఆచారం అనాదిగా వస్తున్నది లోగడ కొన్నిసంబంధాలు కట్నాల దగ్గర పొంతన కుదరక తప్పిపోయాయి అయితే అది మనసులో వుంచుకొని పెళ్ళిచూపులే నిరర్థకం అంటావా? అందరూ కట్నాలను ఆశించేవారే అంటావా?" అంది పార్వతి

"అమ్మా! మార్జాల కబళ న్యాయం అంటే ఇదే! ప్రతీమారు నీవు ఇదేవిధంగా ఆశపడి మోసపోతున్నావు నీవు వూహించేటటువంటి సహృదయులు వుంటారనే నాకు నమ్మకంలేదు" అంది అనూరాధ

"అనూ! మధ్యతరగతి కుటుంబాలకు ఈ బాధ తప్పదు బడిపంతులు కడుపున పుట్టిన నీకు ఈవ్యథ తప్పదు ఇష్టంలేదని తెలిసినా నా ఆరాటంకొద్ది వారిని రమ్మనమని ఆహ్వానించాను వస్తున్నారు ఇంటికి పిలిపించి అవమానం చేసారన్న అపకీర్తి నాకు రానివ్వకు" అన్నాడు సత్యనారాయణ కుమార్తెను బ్రతిమాలుతూ

"నాన్నా! నీకు అవమానం కలిగేపని నేను చెయ్యను అయితే నీవు నాకో మాటివ్వాలి"

"అర్థమైంది తల్లీ! ఈ సంబంధం కుదరకపోతే మళ్ళీ పెళ్ళిచూపుల ప్రస్తావన తేను నీవు నీ కాళ్ళమీద నిలబడి పరువుగా వుద్యోగం చేసుకుందువుగాని, నేను కాదనను"

అనూరాధ వెళ్ళిపోయింది

పార్వతి భర్తవంక ఆందోళనగా చూసింది "ఈ సంబంధం తప్పిపోతేమరి 'అనూ'కి పెళ్ళి చేయరా?" అంది

"పార్వతీ! వాళ్ళు వచ్చేసమయం అవుతున్నాది మరేం దిగులు పెట్టుకోకు అమ్మాయి ముస్తాబు విషయంచూడు" అన్నాడు సత్యనారాయణ భార్యకైతే దిగులు పెట్టుకోవద్దని చెప్పాడు కాని తాను దిగులుచెందకుండా వుండలేకపోయాడు

కట్నాలసమస్య ఇంతిగా విషమించుకుపోవాలా? ఈ ఆచారవ్యవహారాలను పెద్దలు ఏ దృష్టితో పెట్టారు? కాని నేడు వ్యాపార దృక్పథం తప్పించి మరో దృక్పథం కనిపిస్తున్నాదా? ఆడపిల్ల పెళ్ళి అంటే ఆనందంకన్నా దుఃఖమే అధికమా? తనూ కట్నం తీసుకున్నాడు. ఆ రోజుల్లో రెండువేల నూటపదహార్లు ఆనాటి రూపాయి విలువ ప్రకారం అది తక్కువకాదు అంత కట్నం ఇవ్వలేని ఒకటి రెండు సంబంధాలను తనూ తృణీకరించాడు అందుకా నేడు తనకీ పరీక్ష? తను నేరం చేసి వుంటే తన కూతురికా శిక్ష? అనూలో ఏ లోపం వుంది?

* * *

"సత్యం! కట్నం ఇవ్వలేనని భయపడి అమ్మాయికి పెళ్ళి సంబంధాలే చూడడం మానివేస్తావా? చూడు సత్యం! మనుషులందరూ ఒకేలాగుంటారని భావించటం సబబుకాదు విశ్వనాథంగారని నాకు తెలిసినాయన ఢిల్లీలో వున్నారు వారి అబ్బాయి బి టెక్ పాసై టెలిఫోన్సులో పనిచేస్తున్నాడు మీ అమ్మాయి విషయం చెప్పాను అమ్మాయి నచ్చితే చేసుకుంటాం అన్నారు నా మాట విని వారికో ఉత్తరం ముక్క

పెళ్లి చూపులు

పడేయి, పెళ్ళిచూపులకు రమ్మనమని'' అన్నాడు సత్యనారాయణ స్నేహితుడు గోపాలం

''గోపాలం! నీకు తెలియందేముంది ఎక్కువగా కట్నాలు ఇచ్చుకునే స్థితిలోలేను అబ్బాయి బి టెక్ అంటున్నావు మరి మనకు అందుబాటులో వుంటారా? అసలే అమ్మాయి పెళ్ళిచూపులంటే విముఖత చూపుతున్నాది అందరాని పళ్ళకెందుకు? మనం హైరానా పడటం మిగులుతుంది తీరా కట్నం దగ్గర బెడిసికొడితే అమ్మాయి బాధపడుతుంది'' అన్నాడు సత్యనారాయణ

''కట్నం కోరరని నేను అయితే కట్నమే ముఖ్యం అనుకునేవాళ్ళు కారు మన అనూరాధ అదృష్టం బాగుంటే కుదరవచ్చునుగా? మరో మాట చెప్పక వెంటనే వుత్తరం రాయి ఇదిగో అడ్రసు'' అన్నాడు గోపాలం

సత్యనారాయణ వారికి వుత్తరం రాయడం, అటునుంచి జవాబు రావడం అయింది

ఈరోజే వస్తున్నారు వారిని తీసుకురావడానికి గోపాలం స్టేషనుకి వెళ్ళాడు

* * *

గేటుముందు రెండు రిక్షాలు ఆగడం గమనించి ''పార్వతీ! వాళ్ళు వచ్చినట్లున్నారు'' అని అంటూ వీధిలోనికి వెళ్ళాడు సత్యనారాయణ

''ఇతడే సత్యనారాయణ నా మిత్రుడు మీరు చూడబోయే అనూరాధ తండ్రి ఒరేయ్ సత్యం! ఈమె విశ్వనాధంగారి భార్య సుబ్బలక్ష్మిగారు ఇతను విజయ్ వారి అబ్బాయి'' అంటూ పరిచయాలు పూర్తిచేసాడు గోపాలం

''విశ్వనాధంగారు రాలేదా?'' అన్నాడు సత్యనారాయణ

''వారికి క్షణం తీరికవుండదు పిల్లను చూసుకోవలసింది — నచ్చుకోవలసింది ఇదిగో వీడూ — నేను'' అంది సుబ్బలక్ష్మి

'పిల్లను చూడగానే నచ్చుకోగానే సరిపోతుందా? వ్యవహారం అంతా తర్వాతనేవుంది' అనుకున్నాడు మనసులో సత్యనారాయణ

ఆ తరువాత అందరు గదిలోనికి వెళ్ళారు పార్వతి వచ్చి నమస్కరించింది

''చూడండి! నాదొక్కమనవి మావాడు చెప్పాడోలేదో! నేను బడిపంతుల్ని బడిపంతుళ్ళ స్థితిగతులు మీకు తెలియనికావు విశ్వనాధంగారు కూడా వచ్చివుంటే కట్నకానుకల విషయం కూడా ముచ్చటించుకోవడం జరిగిపోయేది వారు రాలేదు'' అన్నాడు సత్యనారాయణ

''బాగుందండీ! మీరు వ్యవహారం అటునుంచే నడిపేలాగున్నారు బేరసారాలు చేసేది, ముందు పిల్లను చూసినతరువాతకదా? మీరు బడిపంతులు అంటున్నారు ఆ విషయం గోపాలంగారు చెప్పారులెండి పోతే మా నాన్నాగారుకూడా చేసింది ఆ వుద్యోగమే'' అంది సుబ్బలక్ష్మి

''అలాగా?'' అన్నాడు

''మా నాన్నాగారిపేరు కొండలరావు మాస్టారు బొబ్బిలి దగ్గర పాలేర్తురు'' అంది

పాలేర్తురు — కొండలరావు మాస్టారు అని వినగానే సత్యనారాయణ గుండెల్లో రైళ్ళు పరుగెట్టాయి గతంలోనికి స్మృతులు పరుగులెట్టాయి

ఎదురుగా కూర్చున్న సుబ్బలక్ష్మి స్థానంలో పరికిణీ వోణీ వేసుకొని సిగ్గుతో ఎరుపెక్కిన బుగ్గలతో ముడుచుకు కూర్చున్న పదహారు సంవత్సరాల పిల్ల కనుపించింది ఔను! ఆ పిల్లను చూసేందుకు తను తల్లిదండ్రితో పాలేర్తురు వెళ్ళాడు ఎప్పుడు? పాతిక సంవత్సరాల క్రిందట

''చెల్లెమ్మా! పిల్లను తీసుకురా'' అన్నాడు గోపాలం

తాను ఏ పిల్లను చూసుకుందికివెళ్ళి పెళ్ళి చేసుకుందికి నిరాకరించాడో ఆమే ఈ నాడు కొడుకుతో తన కూతుర్ని చూసుకుందికి వచ్చింది లోగడ ఈ సత్యనారాయణే తనను నిరాకరించాడని ఆమెకు తెలుస్తే ఈ సంబంధం కుదురుతుందా?

పార్వతివెళ్ళి కుమార్తెను తీసుకువచ్చింది

''మా అమ్మాయి అనూరాధ మెట్రిక్ పాసైంది కుట్లూ అల్లికలువచ్చు సంగీతంలో కూడా కొంత ప్రవేశముంది'' అంది పార్వతి

''బాగుంది పెళ్ళికూతురికి ఈ అర్హతలన్నీ విధిగావుండాలి మన రోజులలోనూ ఇవే ఆచారాలు తరంమారినా ఆచారాలు మారలేదు'' అంది నవ్వుతూ సుబ్బలక్ష్మి

సత్యనారాయణకు ఆ మాటవెనుక, ఆ నవ్వు వెనుక ఏదో ఎత్తిపొడుపు వుందనిపించింది 'మన రోజులలోనూ' అంటూ తనవంకే చూసింది అంటే ఆమె తనను గుర్తుపట్టే వుంటుంది 'అమ్మాయికి సంగీతం ఏమైనావచ్చా?' అని ఆనాడు తన తల్లి ప్రశ్నించింది

'పెద్దగా సంగీతంరాదు కచేరీలు చేయలేకున్నా హార్మోణీమీద నాలుగు కృతులు వాయించగలదు' అంది సుబ్బలక్ష్మితల్లి తనతల్లి కోరికమీద ఒక చిన్న త్యాగరాయకృతి పాడింది మధురమైన కంఠం సత్యనారాయణ కళ్లకు కట్టింది ఆ దృశ్యం

''అదేంకాదు మా అమ్మాయికి వీణ వాయించడంలో మంచి నేర్పువుంది ఇది పెళ్ళిచూపులకని నేర్పించిన విద్యకాదు'' అంది పార్వతి

''సంగీతం ఒక కళ అది అందరికీ అబ్బదు కాని ఏమిటో ఈ పెళ్ళిచూపుల కోసం ప్రతీ పిల్లా నాలుగు కీర్తనలు నేర్చుకోవలసినదే! ఆ రోజుల్లో నాకూ మావాళ్ళు అలాగే నేర్పించారు వచ్చీరాని సంగీతం ఎదురుగా ఇంటర్వ్యూ చేసే మనుషులు ఎలా పాడగలం చెప్పండి? ఓ మారు పెళ్ళిచూపుల సందర్భంలో పాడవలసివచ్చింది ఏం పాడేనో — ఏం వాయించేనో? - పెళ్ళి మాత్రం కుదరలేదు సంగీతం రాకకాదు, కట్నం దగ్గర బేరం కుదరక'' అంది సుబ్బలక్ష్మి

ఎప్పటి మాట! సుబ్బలక్ష్మికి ఆనాటి సంగతి ఇంకా గుర్తుంది నిండా పాతిక సంవత్సరాలు గడిచిపోయాయి సంసారయాతనల్లోపడి తను మరచిపోయాడు సుబ్బలక్ష్మి ఇప్పుడా విషయం కాకతాళీయంగా అనివుండదు ఈనాడు తనని అవమానించాలన్న కృతనిశ్చయంతోనే వచ్చింది

''మా సత్యం అనూకి సంగీతం పెళ్ళి కోసం నేర్పించలేదు తల్లీ అనూ! ఒక్క కృతిపాడు'' అన్నాడు గోపాలం

అనూరాధ పాడిన పాట విని ''బాగా పాడావు తల్లీ!'' అంది సుబ్బలక్ష్మి ''అయినా మన మధ్యతరగతి వాళ్ళకు సంగీతం వచ్చినా ఏం ప్రయోజనం వుంది? పెళ్ళి జరిగిన తరువాత సాధనకు అవకాశం ఉంటుందంటారా? మీరే చెప్పండి?'' అంది సుబ్బలక్ష్మి

సత్యనారాయణ శరీరంలో రక్తం గడ్డకట్టుకుపోయింది 'మీరే చెప్పండి' అంది బహుశా తనతోనే ఆనాడు కట్నాల దగ్గర బేరం కుదరలేదు 'పిల్లకు సరిగా సంగీతంకూడా రాదు మావాడు సంగీతం అంటే పడిచస్తాడు' అన్నాడు తండ్రి, సుబ్బలక్ష్మిని చేసుకోకపోవడానికి అసల కారణం అదన్నట్లు అందుకే ఇప్పుడీ ఎదురు సవాలు? 'సత్యనారాయణ గారూ! మీరు సంగీతం అంటే పడిచస్తారుగా? రోజూ సంగీతాన్నే భోజనం చేస్తున్నారా ఈ పాతికేళ్ళ నుంచి? అది మీరే చెప్పండి' అనేగా అర్థం?!

తనను చిత్రహింస చేయడానికి వచ్చింది

''నీ పేరేమిటమ్మా?''

''అనూరాధ''

''ఎంతవరకు చదువుకున్నావు?''

''మెట్రిక్ పాసయ్యాను''

'' పైవునేర్చుకోలేదా?''

'అమ్మాయికి పైవువచ్చా?' అని ఆనాడు నాన్నగారు అడిగారు పాలేర్తురులాంటికుగ్రామంలో వుంటున్నపిల్ల ఏలానేర్చుకుంటుంది? ఆ విషయం గుర్తించుకొనే సుబ్బలక్ష్మి ఈ ప్రశ్నవేసింది సత్యనారాయణ అసౌకర్యంగా కుర్చీలో కదిలేడు అసలు వాళ్ళు వచ్చింది పెళ్ళిచూపులకు కాదు, ప్రతీకారం తీర్చుకోడానికి అందుకే పేలవలసిన బాంబు పేలింది

''నేర్చుకోలేదండి'' అంది అనూరాధ

కన్నీటి వర్షం

నిజాయితీ చంద్రుణ్ణి
అవినీతి మబ్బులు
ఆవరిస్తుంటే,
కుల, మత కలహాల మెరుపులు
కత్తుల్లా
మెరుస్తుంటే,
దగా, మోసాల స్వార్థపు ఉరుములు
గూండాల్లా
ఘర్జిస్తుంటే,
చుక్కలన్నీ
ముఖాలు చాటుచేసుకొంటున్నాయి
రాజకీయ నాయకుల్లా —
ఆకాశం
ఏకధాటిగా కన్నీరు కారుస్తోంది
ప్రస్తుత సమాజంలోని సామాన్యమనిషిలా—

— గుడిసేవ సుందరరామయ్య

రాజాలన్ని ఒక్కలాగె వున్నాయి ఈనాడూ ఆడపిల్లల పెళ్ళిళ్ళు సమస్యగానే మిగిలిపోయింది నా చిన్నతనంలో అంటే ప్రజల్లో చైతన్యంలేదు సాంప్రదాయాలను గుడ్డిగా అనుకరిస్తూ ఎదుటివారిని హీనపరిచేవారు విజ్ఞానంలో మానవుడు ఎంతగా పురోగమించినా, స్త్రీలకు పురుషులతో సమంగా అధికారాలూ, హక్కులూ ఉన్నాయని గుర్తించినా, మనుషుల మానవత్వంలో మార్పురాలేదు మావాడికి పాతికవేలు కట్నం ఇస్తాం అంటూ ఒక పెద్దమనిషి సంప్రదింపులకు వచ్చాడు పెళ్ళి చేయవలసింది డబ్బుకాశపడా ? పెళ్ళికూతురు - పెళ్ళికొడుకు పరస్పరం చూసి అంగీకరించుకోవద్దా ? నా పెళ్ళి ఒకమారు ఈ కట్నం దగ్గరే ఆగిపోయింది వచ్చిన పెళ్ళివారు నన్ను చేసుకుందికి అంగీకరించినట్లే కనబడ్డారట తీరా వారు కోరినకట్నం దొరకటంలేదని ఏవో సాకులుచెప్పి పిల్లనచ్చలేదు అన్నారు అసలు కారణం వేరేవుందిలెండి వేరొకరు రెండువేలు ఇస్తాం అన్నారు ఇంకేం! కుదరవలసిన సంబంధం తప్పిపోయింది '' అంది సుబ్బలక్ష్మి

'సుబ్బలక్ష్మిగారూ ! ఏదో తెలిసో తెలియకో ఆనాడు మిమ్మల్ని చేసుకుందికి నేను నిరాకరించాను అయితే ఆ విషయం ఇలా మనసులో వుంచుకొని ఈనాడు నన్ను చిత్రహింస చేయాలా ? పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతాయంటారు కొన్ని పెళ్ళి చూపులు చూపులతోనే నిలిచిపోతాయి అయితే ఆ విషయాన్ని ఇంత రాద్ధాంతంగా చేసి ఈనాడు మీరు కసితీర్చుకోవాలా ? మీరు నన్ను కించపరిచినా బాధపడను జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నాను స్కూలుమాస్టరు కుతుర్నా చేసుకోవడం— అని అనుకున్నాను చివరకు స్కూలు మాస్టరుగానే స్థిరపడవలసి వచ్చింది మీరెంత కటుకుగా మాట్లాడినా అరగించుకోగలిగే శక్తివుంది కాని అనూరాధ అభం శుభం తెలియనిపిల్ల ఇప్పటికే విసిగిపోయింది చిట్టచివర ప్రయత్నంగా ఈ పెళ్ళిచూపులకంగీకరించింది మీరు ఇలాచూసి హేళనచేసిపోతే దాని బ్రతుకేంకాను ?' అని అడగలనుకున్నాడు సభ్యత అడ్డొచ్చింది

ఆమెనోటికి తాళం పడాలంటే నోటికి పని కల్పించాలి భార్యతో ఫలహారాలు తెమ్మని చెప్పాడు పార్వతి ఫలహారాలు తెచ్చింది

పెళ్లి చూపులు

''ఇప్పుడీ ఫలహారాలు ఎందుకండీ ! పన్నెండు గంటలు దాటింది, భోజనాలవేళ '' అంది సుబ్బలక్ష్మి

''ఆనవాయితీకదండీ ! పెళ్ళిచూపులన్న తరువాత ఫలహారాలు పెట్టకపోతే లోకంహర్షించదు లోకంమాట ఎలాగున్నా మీరు మాకు సభ్యతకూడా తెలియదనుకొంటారు'' అంది పార్వతి భర్త ముభావంగా కూర్చున్నాడు

''కొన్ని ఆనవాయితీలు అర్థంలేనివనే అనుకుంటాను ఇప్పుడు ఫలహారాలు మరికొంత సేపుపోతే భోజనాలు ఇది అనవసరపు శ్రమా ఖర్చూకాదా ?''

''   ''

''ఏమిటీ ! మాకు భోజనం పెట్టకుండా ఉత్తి ఫలహారాలతోనే పంపిస్తారా ? మేం ఢిల్లీలో మొన్నరాత్రి రైలెక్కాం ''

''అబ్బే ! అదికాదు మీ భోజనం ఏర్పాట్లు గోపాలం అన్నయ్యగారు చూస్తున్నారు ఇక్కడ నాలుగు విషయాలూ మాట్లాడుకుని, పిల్లను చేసుకుందికి మీరు ఇష్టపడినట్లు ఒక్కముక్క చెప్తే, తరువాత కార్యక్రమం భోజనాలే'' అంది పార్వతి

''అమ్మో ! కాబోయే కోడలి చేతివంట తినాలని ఆశపడి వచ్చాం మాకా అదృష్టం లేదా ?''

''ఈ ఫలహారాలు అమ్మాయి చేసినవే ''

''వదినగారూ ! మాకు ఇక్కడే భోజనం చేయాలని ఉంది మీరు శ్రమ అనుకోకూడదు ''

''చూసారా ! మీరు క్షణంక్రితం శ్రమా ఖర్చూ అన్నారు మీరు ఇక్కడే భోజనం చేయాలనుకుంటే అది శ్రమా ఖర్చూ కాదా ? అక్కడ మా వదిన వండిన పిండివంట లేంకావాలి ?'' అంది పార్వతి

''సుబ్బలక్ష్మిగారు ! అసలు విషయం అదికాదు కతుకుతే అతకదంటారు ఎంతైనా పూర్వులేర్పరిచిన సాంప్రదాయాలు '' అన్నాడు గోపాలం.

సుబ్బలక్ష్మి నవ్వింది సత్యనారాయణ మరింత ముడుచుకుపోయాడు ఏమిటీ వింతధోరణి ?

కాకినాడలో మంజులా ఆర్ట్స్ అకాడెమీవారు తమ 13వ వార్షికోత్సవ సందర్భంగా ప్రదర్శించిన ''భయస్కోప్'' మ్యూజిమైమ్‌లో ఒక దృశ్యం శ్రీ భద్రం, శ్రీ పాపారావు, శ్రీమతి మణికుమారి, డా దివాకర్, డా మహేష్, యస్సారెమ్టి బాబు, వేణు డా జయరామశర్మలని చిత్రంలో చూడవచ్చు

''సాంప్రదాయం కాదనను అయితే వాటిని గుడ్డిగా ఆచరించడం అర్థంలేదు కతుకుతే అతకదా ? అందుకు ప్రమాణం ఏమిటి ? కతకవంత మాత్రాన అతికిపోతుందా ? పోనీ దానికేవా నిదర్శనం వుందా ? ఈ ఫలహారాలు తిన్నా వీరింటిలో కతికినట్లేగా ? ఇప్పుడు మాత్రం బెడిసికొట్టదా ? అసలు అతకడానికైనా అతక్కపోవడానికైనా వేరే కారణాలుంటాయి ? ఏమంటారు సత్యనారాయణ గారూ ?''

సత్యనారాయణకు తనకింద భూమి బద్దలైనట్లు అనిపించింది నేరుగా తననే అడిగింది వాళ్ళతో వియ్యం జరుగుతుందని ఆశించడం వ్యర్థం

''పార్వతీ ! భోజనం ఏర్పాట్లు చెయ్యి'' అన్నాడు

'అసలు పెళ్ళిచూపుల్లో అవసరమైనవాటిని విస్మరించి అనవసరమైనవాటికి ప్రాధాన్యత ఇస్తున్నారు మనవాళ్ళు'' అంది సుబ్బలక్ష్మి

'అమ్మా ! మీరు రాజధానినగరం ఢిల్లీలో వుంటున్నారు మేం గుట్టుగా పల్లెటూరిలో కాపురం చేస్తున్నాం ఈ సభ్య సమాజంలో ఏవి అవసరమో ఏవి అనవసరమో మాకెలా తెలుస్తాయి ?' సత్యనారాయణ బయటకనలేక మనసులోనే అనుకున్న మాట

''అనూరాధా ! నీకు వంట చాతనౌనని మీ అమ్మగారు అంటున్నారు ఈ పూట నీ చేతి వంట తినాలనివుంది'' అంది సుబ్బలక్ష్మి

అనూరాధ తల్లివంక చూసింది

''చిన్నపిల్ల! అది ఏం చేస్తుంది ? పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్తే ఎలాగూ తప్పదు '' అంది పార్వతి ఆమెకూ అసహనంగానే వుంది

''అనూరాధా ! ఆవిడకా కోరిక వుంటే అలాగే కానీయ్ చెల్లెమ్మా మధ్య మన అభ్యంతరం ఎందుకు ?'' అన్నాడు గోపాలం

సుబ్బలక్ష్మి ముఖం ప్రసన్నమైంది

''అనూరాధా ! ఇంటిలో కూరలేమైనా వున్నాయా ?''

''ఉన్నాయండీ ! బంగాళాదుంపలు, కాబేజీలు ''

''ఆ కూరలు రోజూ తింటున్నవే దగ్గరలోనే బజారు వుందిగా ? బీరకాయలు తీసుకురా అన్నం, బీరకాయ కూరా, చారూ ఇవి చాలు మరేం హైరానా పడవలసింది లేదు ఇదిగో ఈ పది రూపాయలు అన్నట్లు వస్తూ కిరాణాకొట్టులో బియ్యం వగైరా కొను'' అంటూ అనూరాధ దగ్గరకొచ్చి ఆమె చేతిలో పది రూపాయలుంచింది సుబ్బలక్ష్మి

''వదినగారూ ! మీరు డబ్బులివ్వాలా ? బియ్యం, చింతపండు వగైరాలు ఎందుకు ? మీ దయవలన వాటికి లోటు లేదు బీరకాయలన్నారు అవి తెచ్చుకోవాలి కూరకోసం అది బజారుకు పోవాలా ? మావారున్నారు, అన్నయ్యగారున్నారు- తేరా? వారిలో ఒకరు కూరతెచ్చేలోగా అది వంట మొదలెటుతుంది ఏమంటారు ?'' ఎంత రాజధాని నగరంలో వున్నా, ఎంత పెళ్ళికొడుకు తల్లి అయినా ఇంత అధారిటి చెలాయించాలా ? అన్న అక్కసుతో అంది

సుబ్బలక్ష్మి ఆమె కోరికను చాలా వినోదంగ





తీసుకుంది "ఏం మీ అమ్మాయికి బజారు పని చేతకాదా?"

"అమ్మా! నేనే తెస్తాను" అంటూ అనూరాధ లేచి వంటింటిలోనికి వెళ్ళి సంచీ, సీసా తీసుకొని వీధిలోనికి వెళ్ళింది

సత్యనారాయణ బాణంలా వెళ్తున్న కూతుర్ని చూసి ఆశ్చర్యపోయాడు అనూరాధ ఈ అవమానం సహించలేక వెళ్ళిపోతోందని అనుకున్నాడు

* * *

"ఇదిగోనండీ! అర్ధరూపాయి మిగిలింది సామానుల చీటీ ఇది" అంది అనూరాధ సుబ్బలక్ష్మి చీటీ చూడసాగింది "మీరు త్వరగా రావాలన్నారని రిక్షాలో వెళ్ళివచ్చాను రిక్షాకు రూపాయిన్నర అయింది" అంది సంజాయిషీగా

మరోగంట గడచిన తరువాత గోపాలానికి, భర్తకు, ఆ వచ్చిన బంధువులకు అరటాకులు వేసి భోజనానికి పిలిచింది పార్వతి

వడ్డనలో అనూరాధ కల్పించుకోలేదు సుబ్బలక్ష్మి ఏమీ అనలేదు

"అన్నయ్యగారూ! ఇంక మేంవచ్చిన పని అయినట్లే! మీ అమ్మాయి నాకూ మా వాడికీ నచ్చింది మీకు మావాడు నచ్చినట్లేనా?" అంది సుబ్బలక్ష్మి

"ఆడపిల్లవాళ్ళ ఇష్టాయిష్టాలతో ప్రమేయం వుంటుందనుకోను మగపెళ్ళివారు నచ్చుకోవడం వారికోసరం అడిగారు కాబట్టి చెప్తున్నాను మాకూ అబ్బాయినచ్చాడు ఇక కట్నాల దగ్గర కుదరకపోతే అది మా దురదృష్టం" అన్నాడు సత్యనారాయణ

"బాగాచెప్పారు కట్నకానుకులంటే గుర్తుకొచ్చింది మీకూ అబ్బాయివున్నాడు కదూ?"

"ఉన్నాడు ఇంకా చిన్నవాడు చదువు పూర్తికాలేదు"

"చదువుకేం పూర్తౌతుంది ఉద్యోగం వస్తుంది అబ్బాయి పెళ్ళిలో ఎంతకట్నం రాబట్టాలనుకుంటున్నారు?"

"మూడునాలుగేళ్ళ తరువాతి సంగతి ఇప్పుడప్పుడే ఎలా నిర్ధారణగా చెప్పగలను?"

"నిజమే! సత్యమైనమాట చెప్పారు ఆనాడు మార్కెట్టులో పెళ్ళికొడుకుల రేటు ఎంత వుంటుందో? ధరవరలు ఇలా రోజురోజుకి పెరిగిపోతూంటే కట్నాలు పెరగవా? నా చిన్నతనంలో

పెళ్లి చూపులు

రెండువేలు నేడు ఆరేటు పదిరేట్లు పెరిగింది"

"సుబ్బలక్ష్మిగారూ! ఏనాడో వాడు తీసుకోబోయే కట్నంగురించి ఇప్పుడెందుకు? మీరెంత కావాలనుకుంటున్నారో చెప్పండి" అన్నాడు గోపాలం

"మావాడి పెళ్ళివిషయం నేనేనాడో ఒక నిర్ధారణకు వచ్చాను అలాగే సత్యనారాయణగారూ తన కొడుక్కి ఎంతకట్నం తీసుకోవాలనుకుంటున్నారో తెలుసుకుందామని పోనీలెండి మావాడు బి టెక్ పాసయ్యాడు ఇంతఇస్తాం ఇంత ఇస్తాం అంటూ వస్తున్నారు మీకు చెప్పానుగా పాతికవేలు వరకు ఇస్తాం అని ఈమధ్యనే ఒకరు వచ్చారు కట్నాల సమస్య ఎంత వుధృతంగా ఉందో నాకు తెలుసు ఎంతమంది ఆడపిల్లల జీవితాలు ఈ సమస్యవలన నాశనమౌతున్నాయో మనం రోజూ పేపర్లో చదువుతున్నాం" అంది

"మీ ఆశయాలు బాగానేవున్నాయి మా వాడు పెద్దగా ఇచ్చుకునేస్థితిలోలేడు ఆ సంగతి మీకు ముందే తెలియజేసాను అందువలన మీ వుద్దేశం చెప్తే బాగుంటుంది" అన్నాడు గోపాలం

"అదే చెప్తున్నాను కట్నం తీసుకోవాలని మేం అనుకోవడంలేదు అయితే నాదొక కండిషను ఉంది" అంది సుబ్బలక్ష్మి

'అమ్మా! సుబ్బలక్ష్మితల్లీ! నీ వుద్దేశం అర్ధమైంది అబ్బాయికి కట్నంతీసుకోరు కాని మీ అమ్మాయి పెళ్ళికి మీరివ్వవలసిన కట్నంమాత్రం మేం ఇవ్వాలి ఇదోలంకె ఈ నాడు అలాగెంతరో లంకెపెడుతున్నారు మీరుమాత్రం తక్కువతిన్నారా? ఇంత గొప్పహోదాలో వున్నారు ఎంత పెద్దసంబంధం చేయాలనుకుంటున్నారో? ఆ పెళ్ళికొడుకు మాత్రం ఎంతలో కొండ దిగుతాడో? వాళ్ళు అడిగే డబ్బు మేంఇచ్చుకోలేం మీ కండిషన్నూ వద్దూ మీ సంబంధం వద్దు' అనుకున్నాడు సత్యనారాయణ

"చెప్పండి, ఆ కండిషనేమిటో?" అడిగాడు వుత్సుకతతో గోపాలం

"అదే చెప్తున్నాను ఈ పిల్లను మేంకట్నం లేకుండానే చేసుకుంటాం ప్రతిఫలంగా మీరు"

"మరి చెప్పకండి — మీ అమ్మాయి పెళ్ళికయ్యే కట్నం మేం ఇచ్చుకోవాలంటారా? ఆ కట్నం ఇచ్చుకునే స్థితిలోవుంటే మా అమ్మాయి పెళ్ళే చేయగలంగా?" అన్నాడు సత్యనారాయణ కోపాన్ని అణచుకోలేక

"మీరు పొరపాటుగ అర్థంచేసుకున్నారు నా ఉద్దేశం అదికాదు ఆడపిల్లవాళ్ళ వద్దనుంచి మేం ఆశించేదదికాదు నేను కేవలం ఆశించేది నా కోడలు సంగీతంలో స్థితప్రజ్ఞురాలు కావాలని కాదు, బంగారుగుడ్లుపెట్టే బాతులాంటిది కావాలని కాదు కట్నం అక్కరలేదుకాని లాంఛనాల రూపంగ స్కూటర్లు, టి వి లూ కావాలని అంతకన్నాకాదు నేను ఆశించేది నా కోడలు వ్యవహారదక్షతకలది మగవాళ్ళు ఉద్యోగాల్లో ఇల్లుపట్టకుండా తిరుగుతారు ఉదయం ఇల్లువదిలితే తిరిగి ఏ రాత్రికో వస్తారు ఇంటిబాధ్యతలు నిర్వహించగలిగే ప్రజ్ఞ కావాలి కానిసమయంలో చుట్టాలు వచ్చినా, నిత్యావసర వస్తువులు నిండుకున్నా భర్త లేడే, ఎలా? అనే చింతపడకూడదు తానే ఆస్థితిని ఎదుర్కోగలిగినదై వుండాలి అందుకే నా ఈ పరీక్షలు ఆ పరీక్షల్లో అనూరాధ నెగ్గింది ఇంక కట్నాల ప్రసక్తేలేదు మా వాడికి కట్నం తీసుకోరాదని నేను నా పెళ్ళి రోజునే నిశ్చయించుకున్నాను అయితే ఈ పెళ్ళి జరగాలంటే నాదొక కండిషను వున్నమాట మాత్రం వాస్తవం" అంది సుబ్బలక్ష్మి

"ఆ కండిషను ఏదో మీరుచెప్పాలి" అన్నాడు గోపాలం

"సత్యనారాయణగారికీ ఒక అబ్బాయి వున్నాడు మరో మూడు నాలుగేళ్ళ తరువాత పెళ్ళిచేస్తారు వారుకూడా కట్నం ఆశించకుండా ఒక గుణవంతురాలైన పేదపిల్లను చేసుకోవాలి అలా మరో అభాగిని జీవితానికి పూలబాట వేయాలి చెప్పండి ఈ షరతు అంగీకారమైతే ముహూర్తాలు ఎప్పుడు నిశ్చయించినా మేం పెళ్ళికి తరలివస్తాం"

గోపాలం సత్యనారాయణవంక చూసాడు పార్వతి కన్నులు ఆనందంతో చెమర్చాయి సత్యనారాయణ హృదయంలో రాజుకుంటున్న జ్వాలలు చల్లారిపోయాయి ఎంత తియ్యటిమాట! ఇది కలా? వాస్తవమా?

"అదిగో! మావాడు ఈ కండిషనుకి అంగీకరించాడు ఔనా సత్యం?" అన్నాడు గోపాలం ఆనందంగా

సత్యనారాయణ సంతోషంతో పులకించిపోయాడు నోటమాట రాలేదు తనకీ కండిషను సమ్మతమేనని తల వూపాడు ●